చదువుతోనే ఉజ్వల భవిష్యత్



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో నోడల్ అధికారి, ఉపాధ్యాయులు

మన్ననూర్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అమ్రాబాద్ నోడల్ అధికారి సిద్దార్థ మహదేవ్ అన్నారు. బుధవారం స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై 8–9 తరగతుల విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అమ్రాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల, మన్ననూర్‌లోని పీటీజీ, సాంఘిక సంక్షేమ గురుకులం, గిరిజన ఉన్నత పాఠశాల, మన్ననూర్, వటువర్లపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మన్ననూర్‌లోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో దోమలపెంట పాఠశాల హెచ్‌ఎం నాగయ్య, ఉపాధ్యాయులు సుధాకర్, కౌశల్యా, కృష్ణయ్య, విజయ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



పాన్‌గల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పాన్‌గల్ మాజీ ఎంపీటీసీ రాంచందర్‌యాదవ్, శాగాపూర్, బుసిరెడ్డిపల్లి, మల్లాయిపల్లితండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గడప, గడపకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, విండో వైస్ చైర్మన్ కుర్వబాలయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్, హలీమ్‌పాషా, జ్యోతినందన్‌రెడ్డి, దశరథనాయుడు, తిరుపతియాదవ్, బలవర్ధన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం కొల్లాపూర్‌లో ఎంపీ రాములు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 4, 5 వార్డుల్లో ఆయన పర్యటించారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట కౌన్సిలర్ పసుపుల కృష్ణ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన తిరుపతమ్మ గౌడ్

కొల్లాపూర్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ కాటగాని తిరుపతమ్మగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్ మంగళవారం రాత్రి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



తిరుపతమ్మకు కండువా కప్పుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

చిన్నంబావి: ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బీరం హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి విజయమ్మ అన్నారు. ఆమె మండలంలోని పెద్దమారూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామణమ్మ, సర్పంచ్ గోవిందు శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బీశన్న, చిన్నారెడ్డి, పల్లె మద్దిలేటి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం మండల యువ నాయకుడు బుజ్జుల పరమేష్ ఆధ్వర్యంలో సాతాపూర్‌లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు.

కూచుకుళ్లను ఆశీర్వదించండి



తెలకపల్లి: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్లను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆ పార్టీ కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంతోపాటు గౌరారం తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని వివరించారు. మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద ఎకరాలకు 15వేలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘుకుమార్, ఆంజనేయులు, మల్లయ్య, కురుమయ్య, సాంబశివుడు, రాజారెడ్డి, బిక్కుసాయబు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం



అచ్చంపేట రూరల్/వంగూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు, అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ సతీమణి అనురాధ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని వివిధ వార్డులలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. వంగూరు మండలంలోని ఉల్పర, మిట్టసదగోడు, కోనాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, పండిత్‌రావు, సర్పంచ్ పరుశురాములు, కౌన్సిలర్లు గౌరీశంకర్, శ్రీనివాసులు, పాండురంగారెడ్డి రాజేందర్, శేఖర్, మహబూబ్‌అలీ, ఖాజా పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



కల్వకుర్తిరూరల్: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఆచారి అన్నారు. ప్రజాశాంతి పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన కట్టా జంగయ్య బుధవారం ఉపసంహరించుకున్నారు. అనంతరం ఆమనగల్లులోని బీజేపీ కార్యాలయంలో ఆచారి సమక్షంలో బీజేపీకి గూటికి చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు జంగయ్య పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మన్ననూర్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. అమ్రాబాద్ మండలం మాచారంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణీ పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నీల, అంగన్‌వాడీ టీచర్ ప్రభావతమ్మ ఆవవర్కర్లు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో నూతనంగా నిర్మించే పెద్దమ్మ గుడి నిర్మాణానికి బుధవారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు లాలు యాదవ్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ కులస్తులు ఇష్టదైవంగా కొలిచే పెద్దమ్మ తల్లి గుడిని గ్రామంలో నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. గుడి నిర్మాణం కోసం దాతలు స్థలం ఇవ్వడంతో పాటు నిధులను సమకూర్చడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, కేసీ తండా సర్పంచ్ మల్లేష్ యాదవ్, బాత్క శ్రీనివాసులు, గ్రామ యాదవ సంఘం నాయకులు నగేష్, లక్ష్మయ్య, స్వామి, నాగులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో వారు పర్యటించారు. పార్టీ ప్రకటించిన ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరించారు. కౌన్సిలర్లు నర్సింహారావు, రహీంపాషా, నయూమ్, డాక్టర్ రాముడు తదితరులున్నారు.

ఆంజనేయస్వామి మాల ధారణ స్వీకరణ



అచ్చంపేట రూరల్/తాడూరు: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం గురుస్వామి నల్లపు శ్రీనివాసులు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. తాడూరు కు చెందిన 20 మంది యువకులు మాలధారణ స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

బహుజనుల పక్షాన పోరాడుతా

తెలకపల్లి: ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే బహుజనుల పక్షాన పోరాడుతానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కార్వంగలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హామీలు నమ్మొద్దన్నారు. పృథ్వీరాజు, మహేష్, శివశంకర్, బాలనాగయ్య, మొగులాల్, గోపాల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

చారకొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని అచ్చంపేట బీజేపీ అభ్యర్థి సతీష్ మాదిగ అన్నారు. బుధవారం మండలంలోని సిర్సనగండ్ల, అగ్రహారం తండా, గైరాన్ తండాలో ఆయన ప్రచారం నిర్వహించారు. గ్రామాలు అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రవి నాయక్, రఘు ఉన్నారు.

బల్మూర్‌లో విస్తృత ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: బల్మూరు మండలంలోని రాంనగర్, తోడెళ్లగడ్డ, రామాజిపల్లి, వీరంరాజ్‌పల్లి, బల్మూర్, అనంతవరం, నర్సాయపల్లి, అంబగిరి, మైలారం, లక్ష్మీపల్లి, బాణాల గ్రామ పంచాయతీల్లో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. అదేవిధంగా వంగూరు మండలంలోని రంగాపూర్‌లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. నర్సయ్యయాదవ్, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి, కృష్ణారెడ్డి, వెంకటయ్య, మాజీ ఎంపీపీ కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా



బిజినేపల్లి మండలం వసంతాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: పేదలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగసానిపల్లి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. వసంతాపూర్, కారుకొండ, గౌరారం, మంగనూర్, వెల్గొండ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. పల్లెల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వ పథకాలతోపాటు సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కొమ్ము శ్రీను, బొందయ్య, సురేష్, శ్రీశైలం, శివశంకర్ పాల్గొన్నారు.

యువత ఆలోచించి ఓటు వేయాలి



ఖానాపూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్/చారకొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకులు, అయ్యప్ప మాలధారులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. చారకొండ మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నేమలిగుట్ట తండానుండి వార్డు సభ్యులు జైపాల్ బీఆర్‌ఎస్‌కు చెందిన 20 మంది యువకులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే రైల్వేలైన్ ఏర్పాటు సాధ్యం



కొల్లాపూర్/పెంట్లవెల్లి: నియోజకవర్గానికి రైల్వేలైన్ నిర్మాణం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు సతీమణి భారతి అన్నారు. బుధవారం ఆమె పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలు వార్డుల్లో ఆమె పర్యటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లేనిని ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా గెలుపొందకున్నా కొల్లాపూర్‌కు జాతీయ రహదారిని తీసుకొచ్చారని వివరించారు. అదేవిధంగా పెంట్లవెల్లి మండలంలోని కొండూరు, మాధవస్వామినగర్, మంచాలకట్ట గ్రామాల్లో మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హామీలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, సలీం, మూలె వెంకటేష్, సురేష్, వెంకటస్వామి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: వెల్దండ మండలంలోని నారాయణపూర్, రాఘయపల్లి, చౌదర్‌పల్లి, చెర్కూర్, భర్కత్‌పల్లి, గాన్‌గట్టుతండా, బైరాపూర్ గ్రామాల్లో కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బైరాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కల్వకుర్తి పట్టణంలోని 13, 22 వార్డులలో ఎమ్మెల్యేకు మద్దతుగా ప్రచారం చేశారు. చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లి గ్రామానికి చెందిన నారాయణమ్మ కుమారుడు బైక్ ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీశ్వర్‌రావు బుధవారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ నాగమ్మకురుమయ్య, శ్యామలమ్మ, ఎంపీటీసీ ఖాజా, రజాక్ పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని గొల్లోనిపల్లి గ్రామానికి చెందిన డేరెంగుల వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా రాచూర్‌లో రైతు వెంకటమ్మకు సంబంధించిన పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతిచెందడంతో బాధిత మహిళకు సంజీవ్ కుమార్ రూ.5వేలు, గెన్నేల శ్రీనివాస్ రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంటతండాకు చెందిన రామావత్ గమ్లీ బుధవారం తండా నుంచి మండలకేంద్రానికి సారాను తరలిస్తూ గుట్టమీది తండా స్టేజీ వద్ద పట్టుబడినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బల్మూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టెంట్, కుర్చీలకు నిప్పుపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ శివశంకర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు వెళ్లగా ఇదే అదనుగా దుండగులు భావించి పెట్రోల్ చల్లి టెంట్, కుర్చీలకు నిప్పంటించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో పోలీసుల తనిఖీలు

బల్మూర్: అంబులెన్స్‌లో డబ్బులు తరలిస్తున్నారని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డికి కొందరు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని తుమ్మెన్‌పేట స్టేజీ వద్ద నాగర్‌కర్నూల్-అచ్చంపేట ప్రధాన రహదారిపై వెళ్తున్న అంబులెన్స్‌ను నిలిపి తనిఖీ చేశారు. వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి నగదు లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎవరైన ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



నాగర్‌కర్నూల్‌రూరల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, సీపీఐ పార్టీల మధ్య పొత్తు కుదరడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇస్తాన్నామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. విద్యార్థులకు ఉద్యోగాలు రాక నానా అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హెచ్ ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు హబీబ్, వెంకటస్వామి, పెద్దకుర్మయ్య, చిన్నపాగ శ్రీనివాసులు, నారాయణపాల్గొన్నారు.

క్లుప్తంగా

సమష్టిగా అభివృద్ధి చేసుకుందాం



వంగూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా బాధ్యతతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని మండల పరిషత్ అధ్యక్షురాలు భీమమ్మలాలూయాదవ్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హజరయ్యారు. దీంతో అభివృద్ధి అంశాలపై ఎలాంటి చర్చ లేకుండానే సమావేశం ముగిసింది. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు హమీద్, ఎంపీఓ కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తాం



తాడూరు: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామని తహసీల్దార్ ప్రమీల అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు ఆమె ఎన్నికల సామగ్రిని అందజేసి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులను పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని కోరారు. ఎన్నికల నియమాలను ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని 38 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీ, కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు, గోపాలకృష్ణ, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

కష్టపడ్డా పార్టీ గుర్తించలేదు

అచ్చంపేట రూరల్: పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడ్డా పార్టీలో సముచిత స్థానం, గుర్తింపు దక్కలేదని దీంతో రాజీనామా చేస్తున్నానని బీజేపీ నాయకుడు శ్రీకాంత్‌భీమా తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లుగా అచ్చంపేటలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, అన్ని గ్రామాల్లో బీజేపీ జెండాలను ఏర్పాటు చేసి కార్యకర్తలను తయారు చేశానన్నారు. అధిష్టానం తనను నమ్మించి మోసం చేసిందన్నారు. తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానన్నారు. తనతో పాటు నాయకులు హమీద్, జగదీష్, సాగర్, శశిధర్ పార్టీకి రాజీనామా చేస్తారని వివరించారు.

భజన మండలికి తాళాలు బహూకరణ

లింగాల: కార్తీక మాసం పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగే కార్తీక పూజలలో భజనలు నిర్వహించే భజన మండలి సభ్యులకు బుధవారం ఆలయం ఆవరణలో దాత శివ తాళాలు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి భజనలకు సంబంధించి సామగ్రి సమకూర్చాలని భజన మండలి సభ్యులు కోరుతున్నారు.

శివస్వాములకు అన్నదానం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శివమాల ధరించిన భక్తులకు దాతల సహకారంతో బుధవారం అన్నదానం చేశారు. మొదటి రోజు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం సహకారంతో అన్నదానం చేసినట్లు గురుస్వామి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. శివస్వాములతో పాటు హనుమాన్ మాల ధరించిన భక్తులు పాల్గొన్నారు.

ఆకాశదీపం ఏర్పాటు



అచ్చంపేట రూరల్: కార్తీకమాసం ప్రారంభం కావడంతో పట్టణంలోని ఆయా ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్త మార్కండేయ శివాలయంలో ఆకాశదీపాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



నాగర్‌కర్నూల్ క్రైం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని రామాలయంలో ఆకాశదీపోత్సవం, సామూహిక దీపారాధన కార్యక్రమాన్ని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ కార్తీక మాస విశిష్టత గురించి భక్తులు వివరించారు. కార్యక్రమంలో నిత్య విష్ణు సహస్రపారాయణ కమిటీ సభ్యులు అర్థం రవీందర్, మున్నెపురెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.